తవ్వారు.. వదిలేశారు

- అధ్వానంగా 60 ఫీట్ల రోడ్డు
- రెండేళ్ల క్రితం తవ్వి వదిలేసిన వైనం
- నిత్యం ఇబ్బంది పడుతున్న కాలనీవాసులు


చిద్రమైన శ్రీశ్రీనగర్ రోడ్డు ఇలా..

ఉప్పల్: పీర్జాదిగూడ మున్సిపల్ పరిధిలోని బీబీ సాహెబ్ మక్త రోడ్ల పరిస్థితి అధ్వానంగా తయారైంది. డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచడానికి తవ్విన రోడ్డుకు మరమ్మతులు చేయకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

పేరుకే హుడా లే అవుట్..

హుడా లేఅవుట్ పేరుకు మాత్రమే పరిమితమైందని, కనీసం నడవడానికి రోడ్డు లేకుండా రెండేళ్లుగా పడరాని పాట్లు పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- పీర్జాదిగూడ మున్సిపల్ పరిధిలో 8వ డివిజన్ పరిధిలో శ్రీశ్రీనగర్ హుడా రోడ్లు బురదమయంగా మారాయి. రెండేళ్ల క్రితం రూ. 40 లక్షలతో డ్రైనేజి పైపులైన్ అభివృద్ధి పనులను చేపట్టారు. దీనిలో భాగంగా శ్రీశ్రీనగర్‌కు వెళ్లే 60 ఫీట్ల రోడ్డును ఎక్కడికక్కడ తవ్వి వదిలేశారు.

పచ్చదనం అస్తవ్యస్తం..

పచ్చని చెట్లను సైతం తొలగించారని, రోడ్డు మధ్యలో ఉన్న డివైడర్‌ను ఇష్టానుసారంగా తొలగించడంతో కళావిహీనంగా ఉందని ప్రజలు వాపోయారు. గాలివాన వచ్చినప్పుడల్లా.. ఏపుగా పెరిగిన వృక్షాలు సైతం పడిపోయాయి. రోడ్డు మీదకు రావాలంటే ప్రజలు జంకుతున్నారు.

నిర్మాణ వ్యర్థాల పారబోత..

ఇదే అదునుగా భావించి రోడ్లపై ఇళ్ల నిర్మాణ వ్యర్థాలు సైతం గుట్టలు గుట్టలుగా పారబోసి 60 ఫీట్ల రోడ్డును 20 ఫీట్లు కూడా లేకుండా చేశారనే విమర్శలున్నాయి. డ్రైనేజీకి అవుట్ లెట్ కలుపకుండానే గాలికి వదిలేసి వెళ్లారు.

రెండేళ్లుగా అవస్థలు..

దాదాపు 5 కాలనీ వాసులకు శ్రీశ్రీనగర్ రోడ్డే ప్రధాన రహదారి కావడంతో విద్యార్థులు, ఉద్యోగులు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికీ అనేకసార్లు పీర్జాదిగూడ మున్సిపల్ కమిషనర్, అప్పటి మేయర్ జక్కా వెంకటరెడ్డి, స్థానిక కార్పొరేటర్‌కు ఫిర్యాదు చేశామని ప్రజలు చెబుతున్నారు. దీనిపై కమిషనర్ స్పందించి రోడ్డు పరిస్థితిని పరిశీలించి వెంటనే మరమ్మత్తులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

రాజకీయ పరిస్థితుల కారణంగా ఆలస్యం..

రోడ్డు మరమ్మతులకు రూ. 41 లక్షలు మంజూరుకు కౌన్సిల్‌లో గతంలోనే తీర్మానించారు. రాజకీయ పరిస్థితుల ప్రభావం కారణంగానే పనులు ముందుకు సాగలేదు. మేయర్ కూడా మారిన నేపథ్యంలో కొత్త మేయర్ తగిన చర్యలు తీసుకుంటారని ఆశిస్తున్నాం.

– కార్పొరేటర్ మాధవి

స్వయంగా పరిశీలిస్తాం..

పనులకు సంబంధించిన పూర్తి వివరాలు తెలుసుకున్న తర్వాత స్వయంగా వచ్చి పరిశీలించి వెంటనే తగిన చర్యలు తీసుకుంటాం.

– త్రిలేశ్వర్‌రావు, పీర్జాదిగూడ కమిషనర్

కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తాం...



రోడ్డు మరమ్మత్తులకు రూ. 50 లక్షలు మంజూరయ్యాయని అధికారులు చెబుతున్నారు. ఏడాది గడిచినా ఆ నిధులపై ఎలాంటి సమాచారం లేదు. రోడ్డును ఎవరూ పట్టించుకోవడం లేదు. ఇన్ని అవస్థలు పడుతున్నా పట్టించుకోకపోవడం దుర్మార్గం. అధికారులు పట్టించుకోకపోతే కలెక్టర్ కార్యాలయానికి వెళ్లి ఫిర్యాదు చేస్తాం.

– నాగరాజు, కాలనీ అధ్యక్షుడు

రెండేళ్లుగా తీవ్ర ఇబ్బందులు..



మాది మల్లికార్జుననగర్ దాదాపుగా 500లకు పైగా ఇళ్లు ఉంటాయి. పక్క కాలనీలో దాదాపుగా 1000 వరకు ఇళ్లు ఉన్నాయి. మా ఇంటికి చేరుకోవడానికి ఇదే ఏకైక దారి. మేమంతా గత రెండేళ్లుగా ఇంటికి రావడానికి రోడ్డు సరిగ్గా లేకపోవడంతో నానా ఇబ్బందులు పడుతున్నాం. ఈ విషయాన్ని స్వయంగా అధికారుల దృష్టికి తీసుకొచ్చాం. సమస్యను ఎవ్వరికి చెప్పాలో తెలియడం లేదు. కాలనీవాసులతో కలిసి కలెక్టరేట్‌కు వెళ్దామని నిర్ణయించుకున్నాం.

– సత్తిరెడ్డి, మల్లికార్జుననగర్ కాలనీ ప్రధాన కార్యదర్శి

రూ.54 లక్షలతో అభివృద్ధి పనులు


సీసీరోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ గీత

ఉప్పల్ : చిలుకానగర్ డివిజన్‌లో మర్రిచెట్టు వద్ద రూ. 54 లక్షలతో సీసీరోడ్డు పనులకు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి స్థానిక కార్పొరేటర్ బన్నాల గీతాప్రవీణ్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. డివిజన్ పరిధిలోని బ్రహ్మంగారి ఆలయం, మల్లికార్జుననగర్, మర్రిచెట్టు ప్రాంతాల్లో అభివృద్ధి పనులను చేపడుతున్నట్లు వివరించారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ.. మూడున్నర ఏళ్లలో దాదాపు డివిజన్‌లో రూ. 75 కోట్లతో అభివృద్ధి పనులను చేపట్టినట్లు పేర్కొన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులున్నా.. తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, నర్సింహ్మా, గోల్కొండ జగన్, అశోక్ చారి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి


విద్యార్థులకు మెమోంటోలు అందజేస్తున్న వినోద్‌కుమార్

అల్వాల్: పాఠశాల స్థాయి నుంచి విద్యార్థులు నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఆటల పోటీల ఫెడరేషన్ కార్యాచరణ కార్యదర్శి వినోద్‌కుమార్ అన్నారు. శనివారం అల్వాల్ సూర్యనగర్‌లోని సెయింట్ అల్ ఫెన్సా పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులకు నాయకత్వ బ్యాడ్జిలను అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. పాఠశాలలో విద్యతో పాటు క్రమశిక్షణ, దేశభక్తి అలవర్చుకోవాలన్నారు. తరగతి గదిలో నియమించబడే విద్యార్థి నాయకుడు భవిష్యత్తులో సమాజానికి దోహదపడే వారవుతారన్నారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పాఠశాల కరస్పాండెంట్ జరాడ్ శామ్యూల్, చంద్రమోహన్, సతీష్, జనార్దన్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం


మైనంపల్లికి ఆహ్వానపత్రికను అందజేస్తున్న ఈవో

మల్కాజిగిరి : ఆనంద్‌బాగ్‌లోని లక్ష్మీవేంకటేశ్వర దేవస్థానం వార్షిక బ్రహ్మోత్సవాల్లో పాల్గొనాలని మాజీ ఎమ్మెల్యే మైనంపల్లికి ఆహ్వానపత్రికను ఆలయ ఈవో రవీందర్‌రెడ్డి, ప్రధాన అర్చకులు ముడుంబై వేంకటరమణాచార్యులు అందజేశారు. ఈనెల 15 నుంచి 19 వరకు బ్రహ్మోత్సవాలు జరుగుతాయని వివరించారు.

సేవారత్నం పురస్కారం ప్రదానం

మల్లాపూర్: మల్లాపూర్‌కు చెందిన కాప్రా సర్కిల్ పారిశుద్ధ్య కార్మిక సంఘం అధ్యక్షుడు జి.కుర్మన్నకు కళాకార్, సేవారత్నం – 2024 పురస్కారం లభించింది. లక్ష్మీప్రసన్న చారిటబుల్ ట్రస్ట్, ఫౌండేషన్ ఆధ్వర్యంలో త్యాగరాయగానసభలో అవార్డును వ్యవస్థాపక చైర్మన్ శ్రీధర్‌గుప్తా, గాయని లక్ష్మీప్రసన్న, వెంకట్‌గౌడ్, ఏపూరి సోమన్న చేతుల మీదుగా అందుకున్నారు.


పురస్కారాన్ని అందుకుంటున్న కుర్మన్న

వినతిపత్రం అందజేత


ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నకు వినతిపత్రం అందజేస్తున్న ఆటో కార్మికులు

మల్లాపూర్: ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని కోరుతూ శనివారం జనరల్ యూనిటీ ఫర్ తెలంగాణ సంఘం (ఘూట్స్) ప్రతినిధులు ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నను కలిసి వినతిపత్రం అందజేశారు. ఆటో కార్మికులకు రూ.15 వేలు ఇవ్వాలని కోరారు. ఆటో, క్యాబ్ డ్రైవర్లకు రూ.5 లక్షల ప్రమాదబీమా సాధారణ మరణాలకు వర్తింపజేయాలన్నారు. పెరిగిన నిత్యావసర ధరలకు అనుగుణంగా మీటర్ చార్జీలను పెంచాలని కోరారు. ఆటోకార్మికుల సమస్యలపై సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్తానని వారికి హామీ ఇచ్చినట్లు వివరించారు. అధ్యక్షులు గడ్డం శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి గజేంద్రరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లికార్జున్, కోశాధికారి వెంకటేషంగౌడ్, ఉపాధ్యక్షులు శ్రీనివాస్‌గౌడ్, జాఫర్‌కుమార్, రవీ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

'ఉద్యమకారుల సంక్షేమానికి మరో ఉద్యమం'



అల్వాల్: తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో ఉద్యమకారుల చైతన్యయాత్ర అల్వాల్‌లోని జయశంకర్ విగ్రహం వద్ద పోస్టర్‌ను ఆవిష్కరించారు. ముఖ్యఅతిథిగా తెలంగాణ ఉద్యమ నాయకుడు టీజేఎస్ పార్టీ ఉపాధ్యక్షుడు మారం లక్ష్మారెడ్డి, ఫోరం చైర్మన్ డాక్టర్ చీమ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి సురేందర్‌రెడ్డి, మహిళా అధ్యక్షురాలు జ్యోతిరెడ్డిలు మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఉన్న 33 జిల్లాల ఉద్యమకారులను ఏకం చేయడం, కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను నెరవేర్చుకోవడం, ఉద్యమకారులకు గుర్తింపుకార్డులు, సంక్షేమ బోర్డు సాధించుకోవాలన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని సెప్టెంబర్ 27న తలపెట్టిన ఉద్యమకారుల సన్మాన కార్యక్రమాన్ని ఉద్యమకారులు విజయవంతం చేయాలని కోరారు. ఉద్యమకారుల ఫోరం జెండా ఊపి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు యాదిరెడ్డి, మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు సురేందర్‌రెడ్డి, కో–ఆర్డినేటర్ రాంబాబు, ఉప్పల్ నియోజక వర్గం అధ్యక్షుడు గగన్‌కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి కిరణ్‌కుమార్‌రావు, కో– ఆర్డినేటర్ శ్రీనివాస్, జానకిరెడ్డి, శ్యామల, కె. భూపాల్ పాల్గొన్నారు.

తల్లిదండ్రుల చెంతకు అదృశ్యమైన చిన్నారి


చిన్నారిని తల్లిదండ్రులకు అప్పగించిన పోలీసులు

కుషాయిగూడ: ఇంటి వద్ద ఆడుకుంటూ.. కనిపించకుండా పోయిన మూడేళ్ల చిన్నారిని పోలీసులు తల్లిదండ్రులకు అప్పగించారు. ఈ ఘటన శనివారం కుషాయిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాల ప్రకారం.. చక్రిపురంలో నివసించే కార్తీక్, ప్రవళిక దంపతులు ప్రైవేటు ఉద్యోగులు. కాగా శనివారం ఊరికి వెళ్లి తిరిగొచ్చారు. ఈ క్రమంలో వారి కుమార్తె జైత్రి (3) వారితో పాటుగా ఇంట్లోకి వెళ్లకుండా బయటే ఆడుకుంటుంది. కొద్దిసేపటి తర్వాత గమనించిన తల్లిదండ్రులు కుమార్తె కోసం వెతకగా.. కనిపించలేదు. దీంతో వారు అచూకీ కోసం వెళ్తున్న క్రమంలో ఎవరో బైక్‌పై తీసుకెళ్లినట్లు తెలియడంతో తండ్రి రాచకొండ కంట్రోల్ రూమ్‌కి ఫోన్‌చేసి ఫిర్యాదు చేశాడు. సమీపంలోని మీనాక్షినగర్ కాలనీలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులకు చిన్నారి కనిపించింది. పోలీసులు చిన్నారి వివరాలు తెలుసుకుని తిరిగి వారి తల్లిదండ్రులకు అప్పగించారు. కాగా చిన్నారి తండ్రి తన కూమార్తె అదృశ్యంపై అనుమానం ఉందని ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసును దర్యాప్తు చేస్తున్నామన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ




మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ 26వ డివిజన్ కార్పొరేటర్ రాజేశ్వరిఅంజిరెడ్డి సీఎంఆర్‌ఎఫ్ నుంచి 13మందికి డివిజన్ కార్యాలయంలో సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను శనివారం లబ్ధిదారులకు అందజేశారు.

డాక్టరేట్ ప్రదానం


డాక్టరేట్ అందుకుంటున్న సంజీవ్‌రెడ్డి

బోడుప్పల్: బోడుప్పల్ బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు మంద సంజీవ్‌రెడ్డికి ఇంటర్నేషనల్ పీస్ యూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. శనివారం యూనివర్సిటీ చైర్మన్ చేతుల మీదగా డాక్టరేట్ పట్టాను అందుకున్నారు. ఉత్తమ సేవలు అందించినందుకు డాక్టరేట్ అందజేశారు.

కేంద్ర సహాయమంత్రి బండి పరామర్శ


మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్‌ను పరామర్శిస్తున్న బండి సంజయ్

రామంతాపూర్: ప్రమాదవశాత్తు కాలుకి గాయం కావడంతో రామంతాపూర్‌లోని ఆయన నివాసంలో చికిత్స పొందుతున్న బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్ఎస్. ప్రభాకర్‌ను శనివారం రాత్రి కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ పరామర్శించారు. ఈ సందర్భంగా ప్రభాకర్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని జరిగిన ఘటనపై ఆరా తీశారు. కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్‌రావు, బీజేపీ నేతలు తదితరులు పాల్గొన్నారు.

నీటి పొదుపుపై అవగాహన

గౌతంనగర్: నీటిని పొదుపు చేసి ప్రతి ఒక్కరు ఇంటి ఆవరణలో ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసుకోవాలని మేకల రాముయాదవ్ అన్నారు. హనుమాన్‌పేట్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నీటి పొదుపుపై అవగాహన కార్యక్రమం చేపట్టి కరపత్రాలు పంపిణీ చేశారు.

పార్కుల అభివృద్ధికి కృషి చేస్తా


పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బండారి,కార్పొరేటర్ దేవేందర్‌రెడ్డి

మల్లాపూర్: నియోజకవర్గంలో పార్కుల అభివృద్ధికి తన వంతుగా కృషి చేస్తానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. శనివారం థీమ్ పార్కులో జరుగుతున్న అభివృద్ధి పనులను స్థానిక కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. థీమ్ పార్కులో అసంపూర్తిగా ఉన్న ఇంజినీరింగ్ పనులకు మరిన్ని నిధులు అవసరం ఉన్న నేపథ్యంలో ఈస్ట్ జోనల్ కమిషనర్‌తో నిధుల విషయమై ఫోన్‌లో మాట్లాడారు. పనులు పూర్తయితే ప్రజలకు థీమ్ పార్కును అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. స్థానిక నేతలు తండా వాసుగౌడ్, పీఆర్. ప్రవీణ్, పద్మారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, దయాకర్‌రెడ్డి, మారుతీరావు, ముత్యాలు, సంతోష్ యాదవ్, నర్సింగ్‌రావు, పరమేష్‌రెడ్డి, శ్రీనివాస్, రఘు, రమేష్, వెంకటచారి తదితరులు పాల్గొన్నారు.


మారుతీనగర్‌లోని చిల్డ్రన్స్ పార్కు

రూ.25 లక్షలతో..

మల్కాజిగిరి: మల్కాజిగిరి డివిజన్ మారుతీనగర్‌లో చిల్డ్రన్స్ పార్కును అందుబాటులోకి తీసుకొచ్చామని కార్పొరేటర్ శ్రవణ్ తెలిపారు. ప్రభుత్వ భూమి(జీహెచ్ఎంసీ)లో పార్కు ఏర్పాటు చేయడానికి గత రెండేళ్లుగా అనేక ఇబ్బందులు ఎదురయ్యాయని, వాటిని అధిగమించి సుమారు రూ. 25 లక్షలతో చిల్డ్రన్స్ పార్కు, వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేశామని పేర్కొన్నారు.

దైవ చింతనతోనే మానసిక ప్రశాంతత


విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొన్న ఎమ్మెల్యే బండారి

రామంతాపూర్: డివిజన్ పరిధిలోని సత్యానగర్‌లో శ్రీ దత్తసాయి ధర్మశాస్త్ర సేవా సమితి ఆధ్వర్యంలో దత్తాత్రేయ గణపతి ఓంకారేశ్వర నాగదేవతల విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి శనివారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అధ్యాత్మిక దైవ చింతనతోనే ఆరోగ్యం ఆనందం, సిద్ధించి మనసుకు శాంతి కలుగుతుందన్నారు. ఆధ్యాత్మిక భావనలతో విగ్రహాల ప్రతిష్ఠాపన చేస్తున్న నిర్వాహకుల సేవలు ప్రశంసనీయమన్నారు. ఆలయ ఫౌండర్ జయలక్ష్మి, అధ్యక్షుడు విశ్వనాథం, ఉపాధ్యక్షుడు, కార్యదర్శి నరసింహా, జాయింట్ సెక్రటరీ చందు, బాలకృష్ణ టీఆర్‌ఎస్ నేతలు గంధం నాగేశ్వర్‌రావు, సూరం శంకర్ పాల్గొన్నారు.

ఐక్య పోరాటాలతోనే హక్కుల సాధన:చాడ


భగత్‌సింగ్‌నగర్ కాలనీలో పర్యటిస్తున్న చాడ వెంకట్‌రెడ్డి

మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని భగత్‌సింగ్‌నగర్ కాలనీలో సీపీఐ జాతీయ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్‌రెడ్డి పర్యటించారు. కాలనీల్లో గుడిసె గుడిసెకు తిరిగి అక్కడి మౌలిక వసతులు, సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ.. ఐక్య పోరాటాలతో హక్కులను సాధించుకోవాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. కమ్యూనిస్టు పార్టీ పేదల పక్షాన పోరాడి, ఇళ్ల పట్టాలు, మౌలిక సదుపాయాలు, కోర్టు కేసులను సైతం ఎదుర్కొని పేదలకు అండగా ఉంటుందన్నారు. కాలనీ దారి అటవీశాఖ ఆధ్వర్యంలో ఉండటంతో అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించుకుంటామన్నారు. జిల్లా ఇన్‌చార్జి బాల మల్లేష్, జిల్లా సెక్రటరీ డీజీ సాయిల్‌గౌడ్, నాయకులు కాసోజు మహాలక్ష్మి, భగత్ సింగ్ కాలనీ నాయకులు యాదమ్మ, మహేశ్వరి, జ్యోతి, కమలమ్మ, సహదేవులు ఏఐఎస్ఎఫ్ నాయకులు పుట్ట లక్ష్మణ్, మణికంఠరెడ్డి, అన్వర్, హరీష్, నాగరాజు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం


డ్రైనేజీ పనులను ప్రారంభిస్తున్న కాలనీ అసోసియేషన్ సభ్యులు

అల్వాల్: నూతన డ్రైనేజీ నిర్మాణంతో కాలనీల్లో మురుగు సమస్య శాశ్వతంగా పరిష్కారం కానుందని వెంకటాపురం డివిజన్ టీఎస్ఆర్టీసీ కాలనీ అసోసియేషన్ అధ్యక్షులు ఎస్.సంజీవరావు హర్షం వ్యక్తం చేశారు. శనివారం కాలనీలో నూతనంగా చేపట్టిన డ్రైనేజీ నిర్మాణ పనులను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. చాలాకాలంగా డ్రైనేజీ సమస్యతో ఇబ్బంది పడుతున్నామని,మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి చొరవతో పనులు ప్రారంభమయ్యాయన్నారు. కాలనీ ప్రతినిధులు ఎం.వీ కష్ణమోహన్, సిద్ధికి, హనుమంతు, గోపాల్, సుదర్శన్‌రెడ్డి, కాంట్రాక్టర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో శ్రావణ బోనాలు


బోనాల వేడుకలో పాల్గొన్న కరస్పాండెంట్ సందీప్‌కుమార్

మల్లాపూర్ : శ్రావణమాసం బోనాలను పురస్కరించుకుని మల్లాపూర్ భవానీనగర్‌లోని సహస్ర హైస్కూల్లో భక్తిశ్రద్ధలతో శనివారం ఘనంగా బోనాల వేడుకలను నిర్వహించారు. డప్పు చప్పుళ్లు, పోతరాజు విన్యాసాలతో బోనాలను ఊరేగించి అమ్మవారికి సమర్పించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి. పాఠశాల కరస్పాండెంట్ సందీప్‌కుమార్ మాట్లాడుతూ.. సంస్కృతి, సంప్రదాయాలకు బోనాల పండుగ ప్రతీకగా నిలుస్తుందని, బోనాల పండుగకు ఎంతో విశిష్టత ఉందన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ వెంకట్‌నగేష్, ఉపాధ్యాయుల బృందం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శన


ఉప్పల్ మినీ శిల్పారామంలో ప్రదర్శనతో కళాకారులు

ఉప్పల్: ఉప్పల్ మినీ శిల్పారామంలో శనివారం నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. పసుమర్తి శేషుబాబు శిష్యబృందంచే నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. శృంగార లహరి, గొల్లభామ, ప్రవేశం, కృష్ణ కలయసఖి రామాయణ శబ్దం తదితర అంశాలను వేద, మనస్విని, శ్రీవిద్య, శ్రీలక్ష్మి, నిహారిక తదితరులు ప్రదర్శించి మెప్పించారు.

ఏఐఎస్ఎఫ్ సభ్యత్వ నమోదు

మేడిపల్లి: మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా సమితి ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని శనివారం ఉప్పల్ డిపో వద్ద పలు కళాశాలల్లో రాష్ట్ర అధ్యక్షుడు మణికంఠరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ.. ఏఐఎస్ఎఫ్ 89 ఏళ్ల పూర్తి చేసుకుందని, ఆనాడు దేశ స్వాతంత్ర్యం కోసం దేశవ్యాప్తంగా విద్యార్థులను ఏకం చేసి బ్రిటీష్ పాలకులపై తిరుగు బాటు చేసి స్వాతంత్ర్యం రావడానికి కీలక పాత్ర పోషించిందన్నారు. నాటినుండి నేటివరకు విద్యార్థుల హక్కులకు అలుపెరగని పోరాటాలు చేస్తున్న చరిత్ర ఏఐఎస్ఎఫ్‌కి ఉందని, అభిప్రాయపడ్డారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను విడుదల చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగ అభివృద్ధికి కృషిచేయాలని డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఎండీ. అన్వర్, జిల్లా ఉపాధ్యక్షుడు హరీష్, నాయకులు కరుణాకర్, ఆకాష్, సాయి తదితరులు పాల్గొన్నారు.

వైజ్ఞానిక ప్రదర్శనలతోనే విజ్ఞానం


విద్యార్థులతో డాక్టర్ రామచంద్ర, ప్రిన్సిపాల్ నరసింహారెడ్డి

రామంతాపూర్: హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో విద్యార్థులు రూపొందించిన పలు వైజ్ఞానిక ప్రదర్శనలో డ్రోన్ యంత్రం తెలుగు సాంస్కృతి, సంప్రదాయాలతో పాటు ప్రదర్శించిన పలు నమూనాలను పాఠశాల పూర్వ విద్యార్థి ప్రముఖ న్యూరో సర్జన్ డాక్టర్. శ్రీరామచంద్ర ప్రిన్సిపాల్ డాక్టర్ సల్లారం నరసింహారెడ్డితో కలిసి పరిశీలించారు. అనంతరం డాక్టర్ శ్రీరామచంద్ర మాట్లాడుతూ.. వైజ్ఞానిక ప్రదర్శనలు విద్యార్థుల్లో విజ్ఞానాన్ని పెంపొందించడమే కాకుండా వారిలో దాగి ఉన్న సృజనాత్మక శక్తిని మెరుగుపరుస్తుందన్నారు. స్కూల్ అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం

మల్కాజిగిరి: రక్తదానం అన్ని దానాల కన్న గొప్పదని మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి అన్నారు. ఆనంద్‌బాగ్‌లోని క్యాంపు కార్యాలయంలో పార్టీ నాయకుడు పిట్టల నాగరాజు ఆధ్వర్యంలో జరిగిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. మైనంపల్లి మాట్లాడుతూ.. 18 నుంచి 60 ఏళ్లున్న వారు 3 నెలలకోసారి రక్తదానం చేయొచ్చన్నారు. రాష్ట్రంలోనే కాకుండా దేశంలో కూడా అత్యవసర పరిస్థితుల్లో ఉన్న వారికి రక్తం కొరతగా ఉందన్నారు. యువత రక్తదానం చేయడానికి ముందుకు రావాలన్నారు. కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్‌తో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు. సుమారు 32 మంది రక్తదానం చేశారని నిర్వాహకుడు నాగరాజు తెలిపారు.

ఘనంగా సాయిబాబా ఆలయ వార్షికోత్సవం

గౌతంనగర్ : గౌతంనగర్ డివిజన్ పరిధిలోని ఇందిరానెహూనగర్‌లో సాయిబాబా ఆలయ 11వ వార్షికోత్సవం వేడుకలను ఘనంగా నిర్వహించారు. శనివారం జరిగిన ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు ముఖ్య అతిథిగా హాజరై స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆయన మాట్లాడుతూ.. సాయిబాబాను దర్శించుకుంటే సంపదలు కలుగుతాయన్నారు. ఆలయ నిర్వాహకులు శ్రీనివాసచారి, కుమార్, కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్, బీ–బ్లాక్ అధ్యక్షుడు వెంకటేషయాదవ్, జీఎస్‌వీ. సతీష్‌కుమార్, బీకే. శ్రీనివాస్, ఫరీద్, యాదగిరి, నాగరాజు, సత్యనారాయణ, రాంచందర్ పాల్గొన్నారు.